ఆదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గత ఆరు రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గంగవరం ఆదానీ పోర్ట్ కార్మికులకు విశాఖ జిల్లా ఏఐటీయూసీ సంఘీభావం తెలిపింది. సోమవారం ఉదయం పోర్టు ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న గంగవరం ఆదానీ పోర్ట్ కార్మికులను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జీఎస్ఎన్ అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడారు. ఫ్యాక్టరీలు చట్టం రిజిస్ట్రేషన్ చేయకుండా ఆదాని గంగవరం పోర్ట్ సర్వీస్ పేరుతో నడుపు తుందని దీనివల్ల కార్మికులకు అందవలసిన ఇంక్రిమెంట్లు పోతున్నాయని తక్షణమే లేబర్ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీ చట్టం రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కోర్టు కార్మికులు ఇబ్బందులు పడుతు న్నారని పక్కన ఉన్నటువంటి పోర్టు మాదిరిగా 36000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ కెంగువ అచ్యుతరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా ఎన్నికల విధులు నిర్వర్తించాల్సిందే

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయి ఆర్డర్లు తీసుకున్న వారంతా ఎన్నికల విధులకు తప్ప కుండా హాజరుకావాల్సిందేని ఎవరికీ మినహా యింపులు లేవని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ స్పష్టం చేశారు. తొలి విడత శిక్షణకు హాజరుకాని వారు తగిన కారణాలు తెలిపాలని ఆయా విభాగాల అధికారులు ఆదేశించారు. ఓపీవోలుగా విధులు కేటాయించిన వారంతా మంగళవారం సాయంత్రం నాటికి ఫాం.12 పత్రాలు సమర్పించాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం ఉదయం పోలింగ్ పర్సనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్.ఐ.సి. విభాగ అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని, మినహాయింపులు కోరరాదని హితవు పలికారు.

పోలింగ్ పర్సనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్.ఐ.సి. అధికా రులు పలు అంశాలపై మాట్లాడారు. సమా వేశంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీలను ఓడించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆర్ఎస్ఎస్, బిజెపి మనువాద పార్టీలను ఓడించాలని భారత్ బచావో వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరి సమావేశం మాట్లాడుతూ ప్రస్తుత అధికారములో ఉన్న జగన్ రెడ్డి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రానికి ఎటువంటి ఉద్యోగ కల్పన ప్రాజెక్టులు, నిర్ణయాలు చేయకుండా పాలన సాగిస్తున్న విషయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు గుర్తించాలని, బుద్ధి చెప్పే విధంగా ఈ ఎన్నికలు జరగబోతున్నాయని భారత్ బచావో భావిస్తుం దన్నారు. రాష్ట్రంలో ఉన్న పేదరికం సమస్యల కారణంగా రాష్ట్ర ప్రజానీకం తమ హక్కుల సాధన కొరకు ఉద్యమాలతో రోడ్డు మీదకు వస్తే, వారిని పాశవికంగా అణిచివేసి, ప్రధానంగా దళితులపై నిర్వహిస్తున్న దమన కాండను భారత్ బచ్చావో నిరసిస్తుందన్నారు. సమావేశంలో భారత్ బచావో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఆర్ వేమన, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, రాష్ట్ర వైస్ చైర్మన్ గూడూరు సీతామాలక్ష్మి, జిల్లా కోర్ కమిటీ సభ్యులు వేణు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అధికారంలో ఉన్న ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్ అన్నారు. సంక్షేమ పథకాలకు మీట నొక్కడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన, సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినా అరెస్టు చేస్తుందని పరోక్షంగా జగన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం వైఎంసీఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన "ఫోరం ఫర్ డెమోక్రసీ అండ్ డెవలప్మెంట్" అనే అంశంపై ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో జరిగిన సమావేశంలో భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ప్రజలు భయభ్రాంతులతో బతుకుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వం అనేక పథకాలను నిలిపివేసిందని, ముఖ్యంగా ఎస్సీ, బీసీలకు చెందిన పథకాలు అమలు చేయకపోవడం వల్ల పేదలు అనేక బాధలు పడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో 15 శాతం ఉన్న జీడీపీ ఇప్పుడు 9 శాతానికి పడిపోయిందన్నారు. తలసరి ఆదాయం కూడా అన్ని రాష్ట్రాల కంటే తక్కువగా ఉందని చెప్పారు. టీడీపీ హయాంలో రూ.3.70 లక్షలు అప్పులు చేస్తే అందులో లక్ష కోట్లు వరకు అభివృద్ధి, మౌలిక సదుపాయాలకి ఖర్చుపెట్టిందన్నారు. జగన్ ప్రభుత్వం 13 లక్షల కోట్లు అప్పు చేసి ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్ట లేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో మద్యం విక్రయాల ద్వారా ఏడు వేల కోట్లు ఆదాయం వస్తే, మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పిన ఈ ప్రభుత్వం 25 వేల కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకుంటుందన్నారు. విశాఖలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయని ప్రభుత్వం పెద్దలు, లక్షల కోట్ల భూములను కబ్జా చేసారని విమర్శించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నిబంధనలు అతిక్రమించి అధికార పార్టీ ప్రచారం చేస్తుందని సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆచార్య ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత నడుం బిగించాలన్నారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే విద్య, వైద్యం, పరిశ్రమలు వస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ బూడి ముత్యాల నాయుడు, ఐఐఎంపి మాజీ డైరెక్టర్ ఆచార్య విఎస్ఆర్కే ప్రసాద్, ఏయూ మాజీ విసి జెఎం.నాయుడు, ఆచార్య ప్రసాదరావు, పలువురు నగర ప్రముఖులు, మేధావులు, మాజీ వీసీలు పాల్గొన్నారు.

రథసారధికి ఆహ్వానం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి రథోత్సవంకు కె.లక్ష్మణరావును రథసారధిగా రమ్మని ఆలయ పర్యవేక్షణాధికారి పి. శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. సింహాద్రి నాధుని వార్షిక తిరు కళ్యాణం రోజు రథోత్సవం జరుగుతుంది. స్వామివారి రథంకు రథసారథిగా గంగపుత్రులు ఉండటం ఆలయ సంప్రదాయం ప్రకారం జరుగు తుంది. కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు అధికారి రథసారథికి మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలికామని తెలిపారు.

శ్రీరామనవమి పందిరి రాట ఉత్సవం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు ఏకేసీ కాలనీ రామాలయంలో సోమవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణ రాట మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈనెల 17వ తేదీ బుధవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించి 10 గంటల నుండి కళ్యాణం నిర్వహించి 12 గంటలకు భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుండి సీతారాముల వారి విగ్రహాలను మేళతాళాల, కోలాటాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామని, భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాలు ఎదుట శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని పెళ్లిరాట కార్యక్రమాలు ఘనంగా సోమవారం జరిగాయి. దీనిలో భాగంగా మద్ది, రెడ్డిపల్లి, అనంతవరం, బిఆర్ తాళ్లవలస, కోరాడ తదితర గ్రామాల్లో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మద్ది గ్రామంలో రామాలయం ఎదుట ఎంపీపీ రాంబాబు ఆధ్వర్యంలో ఈ పెళ్లిరాట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతవరం గ్రామంలో జి.ఎర్రి నాయుడు ఆధ్వర్యంలో పెళ్లిరాట ఉత్సవం నిర్వహించారు.

సొంత ఊరికి రోడ్డు కూడా వేయించుకోలేని ఏకైక ఎమ్మెల్యే అదీప్

విశాలాంధ్ర - పెందుర్తి: సొంత ఊరికి రోడ్డు కూడా వేయించుకోలేని ఏకైక ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ మాత్రమేనని అదీప్ రాజ్ మాత్రమేనని ఎన్డీఏ కూటమి పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ఆక్షేపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కోట్ని వాని పాలెం, పినగాడి, పెదగాడి గ్రామాలలో సోమవారం సాయంత్రం టిడిపి పీల శ్రీనివాసరావు బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు, జనసేన నాయకులు అయితి సింహాచలం, సేనాపతి సోమశేఖర్ గొర్లె అప్పారావు తదితరులతో కలిసి కలిసి ఆయన ఎన్నికల ప్రచారం సాగించారు. కోట్ని వాని పాలెం గ్రామంలో టిడిపి నాయకుడు బైలపూడి హరి గోపాల్ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని పనులు చేసి చాలా ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన రమేష్ బాబు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధిని అటకెక్కించిన వైసీపీని ఇంటికి పంపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ప్రధానిగా మోడీ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితే పవన్ కళ్యాణ్ కింగ్ మేకర్ గా వ్యవహరించి

రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు 10 రూపాయలు ఇచ్చి 100 లాగేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి గురించి మరిచిపోయారని గత ఎన్నికల్లో ఓటేసి గెలిపించిన ప్రజలను అన్ని విధాల మోసం చేశారని మండిపడ్డారు. గ్రామాల్లో పర్యటించిన ఎన్ డి ఏ నాయకులకు ప్రజలు ఘనస్వాగతం పలికారు మహిళలు హారతులు ఇచ్చి తిలకం దిద్దారు.

ఎన్నికల వ్యయానికి సంబంధించి పక్కా రిజిస్టర్లు నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్నికల వ్యయానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థులు పక్కా రిజిస్టర్లు నిర్వహించాల్సి ఉంటుందని తూర్పు నియోజకవర్గ ఆర్.వో., జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. నామినేషన్లు వేసిన రోజు నుంచి అభ్యర్థుల ఖాతాల్లో వ్యయానికి సంబంధించిన వివరాలను నమోదు చేస్తామని వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, నామి నేషన్లు, ప్రచారాలకు సంబంధించిన ప్రతి అంశంపైనా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని, ఇతరులకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలను అనుసరించి ప్రచారాలు నిర్వహించుకోవాలని, అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 18న నోటిఫికేషన్ వెలువడు తుందని అప్పటి నుంచి పూర్తి స్థాయి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తాజాగా బ్యాంకు ఖాతా తెరవాలని, దాని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలు జరపాలని స్పష్టం చేశారు. క్రిమినల్ కేసులున్న వారు మూడుసార్లు పత్రికల్లో సంబంధిత వివరాలను తెలియజేస్తూ ప్రకటన ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ ధరావతు రూ.10 వేలు చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5 వేలు రాయితీ ఉంటుందని వెల్లడించారు. నామినేషన్లకు సంబంధించి అన్ని వివరాలను సక్రమంగా పూరించాలని, తప్పులు దొర్లకుండా చూసుకోవాలని హితవు పలికారు. మే నెల ఒకటో తేదీన ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ జరుగుతుందన్నారు. మే నెల 13వ తేదీన ఎన్నిక జరుగుతుందని, ఆ రోజు ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ఏజెంట్లు కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఆ రోజు ఉదయం 7.30 గంటల లోపు మాక్ పోలింగ్ జరిగిపోతుందని స్పష్టం చేశారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత వైసీపీ ఖాళీ

భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - మధురవాడ: ఎన్నికలయ్యాక తెలంగాణలో బీఆర్ఎస్ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా వైసీపీ ఖాళీ అయిపోతుందని మాజీ మంత్రి, భీమిలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ పరిధిలో 7వ వార్డులో సోమవారం ప్రచారానికి వచ్చిన ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ మునిగిపోయే పడవ అని, అందుకే ఆ పార్టీ నాయకులు ఎవరు దారి వారు చూసు కుంటు న్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనకు ఎక్స్‌పైరీ డేట్ వచ్చిందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఇప్పుడు మళ్లీ మరో ఛాన్స్ అని మాయ మాటలు చెబుతున్నారని గంటా విమర్శించారు. వ్యక్తిగత విమర్శలకు తాను దూరమని, ఎవరైనా రెచ్చగొట్టే మాటలు మాట్లాడినా స్పందించనని స్పష్టం చేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డిపై ఆదివారం జరిగిన రాయి దాడిని టీడీపీ ఖండిస్తుందని గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎవరైనా గులక రాయితో హత్యాయత్నం చేస్తారా? ఆ సమయంలో లైట్లు, లైవ్ కవరేజ్ ఎందుకు ఆగాయన్న అనుమానాలు ప్రతి ఒక్కరికీ కలుగుతున్నాయని అన్నారు. అంతకు ముందు 7వ వార్డు పరిధిలోని మానం ఆంజనేయులు నగర్, మల్లయ్యపాలెం, మొగదేరమ్మ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఉడా కాలనీ, పిలకవానిపాలెం ప్రాంతాల్లో జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, బీజేపీ నేత రామానాయుడు తదితర నాయకులతో కలిసి గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం భీమిలి పార్టీ ఆఫీస్‌లో ఆర్.ఎం.పి. డాక్టర్ల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శాఖారి శ్రీనివాస్, ఆర్.ఎం.పి. డాక్టర్ల సంఘం నాయకులు, మానం ఆంజనేయులు కాలనీ అసోసియేషన్ నాయకులు జెడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే ఉత్తర నియోజక వర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుంటా

ఉత్తరం వైసీపీ అభ్యర్థి కెకె రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఉత్తర నియోజక వర్గ ప్రజలు రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే వారిని తన గుండెల్లో పెట్టుకుని కష్ట సుఖాల్లో కాపాడుకుంటానని ఉత్తర నియోజక వర్గ ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి కేకే రాజు భావోద్వేగంతో పేర్కొన్నారు. మురళీనగర్ జెఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన మురళీ నగర్ అండ్ మాధవ ధార గౌరీ సేవా సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా కష్ట కాలంలో బాధల్లో ఉన్న ఉత్తర నియోజకవర్గ ప్రజల వైపు కన్నెత్తి కూడా చూడని వారు ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని, అలాంటి వారిని తిరస్కరించి ఉత్తర నియోజక వర్గ ప్రజల కష్ట సుఖాల్లో నిత్యం ప్రజల వెంట ఉంటున్న వారిని బలపరచాలన్నారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ప్రత్యర్థి చేతిలో ఓడినా, వెంటనే ఓటమి బాధ నుంచి కోలుకుని మళ్లీ ఉత్తర నియోజక వర్గ ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు తీర్చడానికి అలుపెరుగని పోరాటం చేశానన్నారు. నియోజక వర్గంలో రహదారులను అత్యంత సుందరంగా తీర్చి దిద్దాన న్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇప్పించేందుకు తీవ్రంగా కృషి చేశానన్నారు. రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసీపీని గెలిపించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రి చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, మల్ల రమణ, పలమరశెట్టి చిన్న, కె.ప్రతాప్, ఝాన్సీ రాణి, పి.సుభాషిణి, యశోద సుధా, పి.నిర్మల, సీనియర్ నాయకులు రేవతి రావు, ఆళ్ళ శివ గణేష్, బొడ్డేటి కిరణ్, పి.శ్యామ్, కె.సూర్యప్రకాష్, సదరం జ్ఞానేష్, ఎం.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న వార్షిక తిరు కళ్యాణంపై సమీక్ష

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి స్వామివారి వార్షిక తిరు కళ్యాణం ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి నిర్వహించారు. ఈనెల 19వ తేదీన శ్రీ స్వామివారి రథోత్సవం, స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవములు జరుగు సందర్భంగా ఈవో ఎస్.శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, రాంబాబు, సహాయ కార్య నిర్వహణ అధికారుల దేవస్థానం సిబ్బంది, వివిధ శాఖ అధికారులతో స్వామివారి నిత్య కల్యాణ మండపం నందు సమన్వయ సమావేశం జరిగింది. ఆలయ కార్య నిర్వహణాధికారి మాట్లాడుతూ రథోత్సవం, స్వామివారి కళ్యాణం తిలకించుటకు వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనలో ముందుండాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయం, బట్టర్ మిల్క్ సదుపాయం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. స్వామివారి కల్యాణమునకు విచ్చేసే భక్తులకు స్వీటు హాట్‌తో అన్న ప్రసాదం భవనంలో భోజనాలు ఏర్పాట్లు చేసినట్లుగా తెలియజేశారు. అలాగే భక్తులకు స్వామివారి ప్రసాదం ముత్యంతో గల తలంబ్రాలు ప్రసాదం కౌంటర్ నందు ఏర్పాటు చేయడమైనదని తెలియజేశారు. సమావేశంలో ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, డిసిపి రాజీవ్ కుమార్, లా అండ్ ఆర్డర్ డిసిపి సత్తిబాబు, ఏసీబీ నరసింహమూర్తి, గోపాలపట్నం సిఐ సురేష్, ట్రాఫిక్ సిఐ పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కార్మికులకు న్యాయంగా చెల్లించాల్సిన నెలసరి వేతనాలను సకాలంలో చెల్లించకపోవడం శోచనీయమని స్టీల్ ఇంటక్ రథ సారథి మంత్రి రాజశేఖర్ విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఉక్కు ఈ.డి వర్క్స్ వద్ద ఇంటక్ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ.డి వర్క్స్ బిల్డింగ్‌లో బైటాయించి, నినాదాలు చేశారు. తక్షణమే మిగిలిన 50% జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్మాగారంను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, పూర్తి స్థాయిలో ఉత్పత్తి తీయాలని సీజీమ్ వర్క్స్ ఇన్‌ఛార్జ్ శ్రీధర్ కి వినతి పత్రం సమర్పించారు. జీతాలు సంగతి తేల్చే వరకు కదలబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంటక్ నాయకులు, కార్యకర్తలు, ఉక్కు కార్మికులు పాల్గొన్నారు.

గంటా నూకరాజుకి పలువురు పరామర్శ

విశాలాంధ్ర - భీమిలి: స్వల్ప అస్వస్థతకు గురై వారం రోజులుగా సిటీలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుచున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజుని పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. టీడీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి, గీతం చైర్మన్ ఎం.శ్రీ భరత్, మాజీ మంత్రి, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, భీమిలి ఇన్చార్జ్ కోరాడ రాజబాబుతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. గంటా నూకరాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంటా నూకరాజు అనుక్షణం ప్రజలమధ్య ఉండే నాయకుడని, ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపిస్తుంటారని అన్నారు. త్వరగా ప్రజల మధ్య రావాలని దేవుని ప్రార్థిస్తున్నామని వారు అన్నారు.

రాష్ట్ర ప్రగతికి వైసీపీని గెలిపించండి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలంటే వైసీపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌లు విజ్ఞప్తి చేశారు. 89వ వార్డు కొత్తపాలెంలో వార్డు అధ్యక్షులు ఐతంశెట్టి గోపి, ఇన్చార్జి దొడ్డి కిరణ్, పిఏసిఎస్ చైర్మన్ అళ్ల పైడ్రాజు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మళ్ల శ్రీను ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం పార్లమెంటు సభ్యుల అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి వైఎస్ఆర్సిపి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. వాలంటీర్‌ల ద్వారా వృద్ధులకు వారి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేయడం ద్వారా ఎంతో మందికి మేలు జరిగిందన్నారు. ఎన్నికల ముందు టీడీపీ కూటమి వల్ల పెన్షన్ దారులు అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేస్తుంటే, ఓర్వలేక అక్కసుతనం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రజలంతా వైసీపీ వైపే ఉన్నారని, రాష్ట్రంలో మరోసారి వైసీపీ ప్రభుత్వం కొలువుతీరనుందని పేర్కొన్నారు. .

క్రీడాకారులకు అండగా వైసీపీ: మంత్రి బొత్స

విశాలాంధ్ర - విశాఖ సిటీ: క్రీడాకారులందరికీ భవిష్యత్‌లో అన్ని రకాల సహకారం అందిస్తామని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ఎస్ శ్రీనివాస్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ బాక్సింగ్, కరాటే, కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, ప్రైవేటు ఎంప్లాయిస్ భారీ ఎత్తున 3000 మంది పార్టీలో జాయిన్ అయ్యారు. మంత్రి బొత్స సత్యనారాయణ, పార్లమెంట్ పరిశీలకులు మళ్ల విజయప్రసాద్, కాయల వెంకటరెడ్డి, జీసీసీ చైర్ పర్సన్ స్వాతిరాణి, యువనాయకులు డా. బొత్స సందీప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి ఇతర వైసీపీ పెద్దల సమక్షంలో బీచ్ రోడ్డులోని వైసీపీ పార్లమెంట్ పార్టీ కార్యాలయం (కామత్ హెూటల్ ప్రక్కన)లో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు అన్ని రంగాల్లో వైసీపీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. యువతకు వైసీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. యువతకు క్రమశిక్షణ, పోటీ తత్వం చాలా అవసరమని, యువత ఓటు వేసే ముందు ఆలోచించి, మీకు మంచి చేసిన వారికి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ విద్యార్థులకి 24 గంటలు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

వైసీపీలోకి ఆర్యవైశ్య కుటుంబాలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీ పరిధిలో మేడిశెట్టి రాంజీ మండల ఆర్యవైశ్య కుటుంబాలకు చెందిన మామిడి శివ, కొండలరావు నానాజీ, కొట్యాడ రవికుమార్, వెంకట్రావు, వెంకట్ రమణ, శ్రీనాథ్ బాబు, బత్తుల బంగారం, కిరణ్ కుమార్ తదితరులు పలువురు శాసనసభ్యులు అవంతి ఆధ్వర్యంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. సంక్షేమ అభివృద్ధి రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జగన్మోహన్ రెడ్డి చేస్తున్న మంచి పనులు చూసి పార్టీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, మండల యూత్ ప్రెసిడెంట్ చందక అప్పలస్వామి, చందక సూరిబాబు, సచివాలయం కన్వీనర్ షినగం చిన్న రామారావు, కోరాడ అప్పలస్వామి నాయుడు, రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

యూసీడీ పీడీ పాపునాయుడు తప్పుచేస్తే
అమాయక ఆర్‌పీపై చర్యలా?

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీలో యూసీడీ విభాగం పాపాల భైరవుడు పాపు నాయుడు మళ్లీ తప్పించుకొన్నాడని, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆ సంస్థను వైసీపీ జేబు సంస్థగా మార్చి పరువు తీసిన పాపు నాయుడుపై విచారణ జరిపిన అధికారులు అసలు దొంగను వదిలేసి క్రింది వారిని బలి చేశారని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ నుంచి నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్‌పై జీవీఎంసీ యూసీడీ పీడీగా వచ్చిన పాపు నాయుడు ఎన్నికల నిబంధనావళిని ఖాతరు చేయకుండా, బరితెగించి వైసీపీ అభ్యర్థుల సేవల్లో మునిగితేలుతుండంతో పెద్ద ఎత్తన ఫిర్యాదులు అందినా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు ఇంకా వైసీపీ నేతల వత్తిడులకే లొంగి పాపు నాయుడును కాపాడుకు వస్తున్నారని ఆరోపించారు. నిజాయతీపరుడైన ముక్కుసూటి ఆఫీసర్‌గా పేరొందిన జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాధన్ పాపు నాయుడుపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినా చర్యలు తీసుకోలేదన్నారు. విశ్వనాధన్ విచారణ జరుపుతున్నారని తెలిసి పాపు నాయుడు బరితెగతించి బలవంతంగా ఆర్‌పీలను బెదిరించి, భయపెట్టి తనకు అనుకూలంగా స్టేట్ మెంట్లు రికార్డు చేయించారన్నారు. ఆ విషయం జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా చర్యలు తీసుకోకపోవడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘిం చడమే అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పోతన్నరెడ్డి, బంటు రవి పాల్గొన్నారు.

అవంతికి పెరుగుతున్న ఆదరణ

లక్ష కోట్ల మెజారిటీతోనే అవంతి గెలుపు
నామినేషన్‌కు సన్నద్ధమవుతున్న కేడర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అవినీతికి తావు లేకుండా, ముక్కు సూటి మనస్తత్వంతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, భీమిలి నియోజకవర్గంను అభివృద్ధి పథంలో నడిపించిన అవంతి శ్రీనివాస్‌కు భీమిలి నియోజకవర్గంలో గ్రామ గ్రామాన ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఉన్న వార్డులను, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో అనునిత్యం శ్రమిస్తూ, ప్రజా సమస్యలపై నిత్యం అధికారులను తట్టి లేపి అవినీతి రహిత పాలన అందించడంలో అవంతికి ఎవరు సాటి లేరని నియోజకవర్గ ప్రజలు విస్తృతంగానే చర్చించుకుంటున్నారు. వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పన లో భాగంగా రోడ్లు, కాలువలు నిర్మాణంతో పాటు నాడు నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత అవంతికే దక్కుతుందని నియోజకవర్గం ప్రజలు అంటున్నారు. మధురవాడ ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ రహదారుల విస్తరణ కోసం ఎనలేని కృషి చేశారని, అనేక కాలనీల అసోసియేషన్ల ప్రజలు అవంతిని కొనియాడుతున్నారు. నియోజకవర్గంలో లక్షలాది మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో అవంతి ఎనలేని కృషి చేశారని, పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా అనునిత్యం అవంతి అందుబాటులో ఉండి, వైద్య సేవలతో పాటు సంక్షేమ పథకాలు అందించారని మళ్ళీ అవంతియ- గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని అనేక గ్రామాల్లో ప్రజలు సంసిద్ధమైనట్లు తెలుస్తుంది. కూటమిలో వర్గ పోరు అధికంగా ఉన్న నేపథ్యంలో అనేక గ్రామాల్లో వైసీపీ క్యాడర్ చెక్కుచెదరకుండా అవంతి వెంటే నడుస్తుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలనకు మరోసారి ప్రజలు పట్టం కడతారని, అవంతి లాంటి ప్రజా సేవకులు భీమిలి నియోజకవర్గం ప్రజలకు దక్కడం తమ అదృష్టమని భీమిలి వైసీపీ నేతలు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అవంతి గెలుపు ఖాయమని లక్ష ఓట్లకు పైగా మెజారిటీ సాధించి తీరుతామని వైసిపి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కూటమి అభ్యర్థులకు చమటలు పట్టిస్తూ, తనదైన శైలిలో ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, అందరిలో ఒకడిగా అవంతి దూసుకు పోతున్నారు. రాష్ట్రంలోనే భీమిలి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలిపి అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర బిందువుగా భీమిలిని మార్చడంలో ఆయన ఎనలేని కృషి చేశారని భీమిలి ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గాలు మారే నేతలు మాకొద్దంటూ, అవంతి మాకు ముద్దు అంటూ, భీమిలి ప్రజలు అవంతికి జై కొడుతున్నారు. అటు అవంతికి మద్దతుగా వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతో భీమిలిలో ప్రచారం మరింత ఊపందుకుంది. అవంతి కుమారుడు, కుమార్తెతో పాటు కుటుంబ సభ్యులు కూడా విస్తృతంగా గ్రామ గ్రామాన తిరిగి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

చంద్రబాబుకు ఉక్కు కార్మికుల కృతజ్ఞతలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక ప్రజా గళం సభలో నారా చంద్రబాబునాయుడు గారు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగే విదంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి, జనసేన, బిజెపి ఎన్డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని ముందుంచి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగే విదంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 32 మంది అమరుల బలిదానం, వేలాది ఎకరాలు భూములు, 44 గ్రామాలు ఉక్కు కర్మాగారం నిర్మాణానికి ఇచ్చిన నిర్వాసితుల త్యాగాలతో నిర్మించుకున్న ఉక్కు కర్మాగారన్ని ప్రభుత్వరంగంలో కొనసాగించి సొంత గనులు, ప్రత్యేక నిధులు కేటాయించాలని విశాఖ ఉక్కు ఫ్యాక్టరిని అన్నివిధాలగా ఆదుకోవాలని ఉక్కు కార్మిక నాయకుడు యేల్లేటి శ్రీనివాసరావు విశాఖపట్నం స్టీలు ప్లాంట్ కార్మికుల తరుపున ధన్యవాదములు తెలియజేస్తున్నాం అని విజ్ఞప్తి చేసారు.

నవమికి వేడులకు బోయవీధి రామాలయం ముస్తాబు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం బోయ వీధిలో రామాలయం భక్తిబావమే సకలజనుల సమ్మేళనానికి ఆదర్శంగా నిలుస్తుందని బోయవీధి గ్రామ పెద్దలు అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా బోయవీధి రామా లయం వద్ద సోమవారం పందిరిరాట కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీడు, అరసవిల్లి పోలిరాజు, చింతల ఎల్లయ్య పాల్గొన్నారు. ఈనెల 17వ తేది బుధవారం శ్రీ సీతారాముల కళ్యాణం జరుగుతుందని అన్నారు. అనాదిగా బోయవీధి గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని గ్రామ పెద్దలు తెలియజేసారు. భక్తితోనే సకల జనులను సన్మార్గంలో నడిపిస్తుందని అన్నారు. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి, మహా శివరాత్రి, హనుమాన్ జయంతి, వినాయక చవితి ఉత్సవాలను బోయవీధి గ్రామంలో పెద్దలు, మహిళలు, యువత సమక్షంలో నిర్వహిస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా మా గ్రామం నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు, సంఘ సభ్యులు, మహిళలు, యువత అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రెల్లిలకు రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాష్ట్ర వ్యాప్తంగా రెల్లి కులస్థులకు రెండు ఎమ్మెల్సీ పదవులివ్వాలని రెల్లి పొలిటికల్ జెపీసీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం విశాఖ జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద రెల్లి పొలిటికల్ జెఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి డబ్బై ఏడేళ్లు గడిచినా రెల్లీల బానిసత్వం నుంచి విముక్తి కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు రెల్లిలకు ఓటు బ్యాంకు గానే ఉపయోగించుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర రెల్లి సంఘం ప్రతినిధి ఎస్.మోహన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెల్లి కులస్థులు 20 లక్షలు దాటి వున్నారని, ఎస్సీ అంటే మాల, మాదిగ ల పేర్లే చెప్పుంటే రెల్లీలు ఎస్సీలు కారా అని ప్రశ్నించారు. జిల్లా రెల్లి కుల ప్రతినిధి కస్తూరి వెంకటరావు మాట్లాడుతూ విద్యా, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బాగా వెనుకబడిన అన్ని రాజకీయ పార్టీల జెండాలు మోయడానికే తప్పా కనీసం నామినేటెడ్ పదవికైనా నోచుకోలేని దళితుల్లో దళితులు రెల్లీలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మామిడి కనకారావు, జయరావు, ఉమా శంకర్, సిహెచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ డా. మల్లిఖార్జునకు వినతి పత్రాన్ని అందజేశారు.

ప్రజానీరాజనాలు చూసి ఓర్వలేకే జననేతపై భౌతిక దాడులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పాఠశాలకు వెళ్లే పిల్లల నుండి పెన్షన్ తీసుకొనే వృద్ధుల వరకు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని విశాఖ ఎంపీ బొత్స ఝాన్సీ, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. వారి సుఖ శాంతులే లక్ష్యంగా జగనన్న పరిపాలన సాగించారన్నారు. 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పల రత్నం (కొండమ్మ) ఆధ్వర్యంలో రోడ్ షో ప్రచారం జరిగింది. బొత్సా ఝాన్సీ, వాసుపల్లి గణేష్ కుమార్‌ల స్థానిక నేతలు గజమాల, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక అతిధులుగా జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, తక్షణ పరిశీలకులు ద్రోణం రాజు శ్రీ వాత్సవ్, డాక్టర్ జహీర్ అహ్మద్ ప్రచారంలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధు సూదన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, వైసిపి నాయకులు దశమంతల మాణిక్యాలు, పెంటపల్లి సత్యనారాయణ, దశమంతల చిన్ని, రాము, సీత రామలక్ష్మి, మణి, మీన, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆడారికి మద్దతుగా సోదరి రమాకుమారి ప్రచారం

విశాలాంధ్ర - మల్కాపురం: ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవీఎంసీ 58వ వార్డు బూత్ నెంబర్ 105 కుంచమాంబ కాలనీలో పశ్చిమ నియోజకవర్గ వై సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా సోదరి సోదరి ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి ప్రచారం చేపట్టారు. జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి, ఎటువంటి లంచాలు లేకుండా ప్రతి ఇంటికి అందుతున్నాయని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, మండల క్లస్టర్ అధ్యక్షులు అంగారాం ప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ పిల్లా కన్న బాబు, సీనియర్ నాయకులు గొందేసి పెద్ద సత్యనారాయణ రెడ్డి, సచివాలయం కన్వీనర్లు చిప్పల సంతోష్, కె.సునీల్, కె.అనిల్, ఫణీంద్ర, వి.నవీన్, కే.వాసు, గుడాల రాజేష్, సబ్మిట్ నానాజీ, పీజీ కుమార్, అంగ బుజ్జి, సీరం బాలు, సిహెచ్.రామారావు, చెరకాపు శివాజీ, అంగ గంటలరావు, జి.శ్రీను, బర్రి కిషోర్, ఫలపాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్డీఏ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ర్యాలీ

విశాలాంధ్ర -పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. సింహాచలం తొలిపావంచా వద్ద శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ర్యాలీని ప్రారంభించగా వేలాది మంది యువకులు ద్విచక్ర వాహనాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడినుండి ప్రారంభమైన ర్యాలీ శ్రీనివాస్ నగర్, ప్రహ్లాదపురం, గోపాలపట్నం బంకు, ఆర్ఆర్ వెంకటాపురం, నాయుడు తోట వేపగుంట, పురుషోత్తపురం, సుజాతనగర్, చిన్నముషిడివాడ మీదుగా పెందుర్తి కూడలి వరకు సాగింది. దారిలో అడుగడుగునా యువకులు కూటమి అభ్యర్థులపై పూల వర్షం కురిపించారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రమేష్ నాయుడు, పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, దీంతో కొత్త కుట్రలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెర లేపారని విమర్శించారు. 2019 మాదిరిగా కోడికత్తి డ్రామాలాడి మళ్లీ అధికారంలోకి రావాలన్న జగన్ కుతంత్రాలను ప్రజలు గుర్తిస్తున్నారని విమర్శించారు. అధికారి పార్టీ విమర్శలకు ఈ ర్యాలీ ఒక హెచ్చరిక అని పంచకర్ల రమేష్ బాబు సభావేదికగా స్పష్టం చేశారు. ఈ ర్యాలీతో అనకాపల్లి ఎంపీ, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు నల్లేరు మీద నడకే అని తేలిపోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత్ శంకర్రావు, రాపర్తి కన్నా, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, నియోజకవర్గం ఇన్చార్జ్ శ్రీనివాస్ నాయుడు, కన్వీనర్ గొర్లె రాము నాయుడు, జనసేన నాయకులు గల్ల శ్రీనివాసరావు కంచిపేట మధు సేనాపతి సోమశేఖర్ పిన్నింటి పార్వతి మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళలపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - భీమిలి: ప్రతి ఉపాధ్యాయుడు కళాకారుడిని పాఠ్య బోధనలో వివిధ కళాత్మక మెలకువలు వినియోగిస్తే విద్యార్థులకు బాగా అర్థమవుతుందని అందుచేత ఉపాధ్యాయులు వివిధ కళలపై అవగాహన అనుభవం పెంచుకోవాలని డైట్ సీనియర్ అధ్యాపకులు ఎల్.సుధాకర్ అన్నారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థలో శనివారం ప్రపంచ కళా దినోత్సవాన్ని కళా విద్య అధ్యాపకురాలు పేట హరిణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత చిత్రకారుడు లియనార్డో డావెన్సీ జన్మదినాన్ని ప్రపంచ కళా దినోత్సవం గా జరుపుకుంటున్నామని ఆయన వేసిన చిత్రాలు ప్రపంచ చరిత్రను చెబుతున్నాయని అన్నారు. వి.హరిణి మాట్లాడుతూ కళ అనేది ఒక భాష రూపమని మనోభావాలను, కథలను, సందేశాలను కళారూపంలో అందిస్తారని తెలిపారు. బోధనకు విద్యార్థులకు అవసరమైన కళలలో ఛాత్రోపాధ్యాయులు ప్రావీణ్యం సంపాదించి మేటుగా నిలవాలని ఆమె అన్నారు. ఛాత్రోపాధ్యా యులందరూ తాము తయారు చేసిన కళా రూపాలను ప్రదర్శించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు ఎస్.త్రినాధరావు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, గొట్టేటి రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా శాఖ మంత్రికి అప్సా వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం అప్సా నాయకులు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల ప్రభుత్వం బదిలీ ధృవపత్రం, స్టడీ సర్టిఫికెట్‌లు లేకుండా ఎవరు ఏ స్కూల్లోనైనా అడ్మిషన్ అవచ్చు అని ఇచ్చిన జి.ఓ పై చర్చించడం జరిగిందని, సానుకూలంగా స్పందించి రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఈ విషయంపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసి ఇచ్చిన జి.ఓ ను సవరించాలని సూచించడం జరిగిందన్నారు. ఆయనకు రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘం అప్సా తరవున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఫైనాన్సియల్ సెక్రటరీ పి.భాస్కరరావు మాట్లాడుతూ త్వరలో ఇదే విషయంపై రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్‌ని కలిసి చర్చించి జీఓను సవరింపజేసే వరకు కృషి చేస్తామని కనుక ఈ విషయంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వారు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఆయనను కలసిన వారిలో అప్సా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు శ్రీనివాస్, సత్యనారాయణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్ నాయుడు, తదితరులు ఉన్నారు.

ఇన్నోవా హైక్రాస్ పెట్రోల్ జీ ఎక్స్ (ఓ) గ్రేడ్ పరిచయం చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తమ 'కస్టమర్-ఫస్ట్' సంస్కృతికి అనుగుణంగా వినియోగదారుల అవసరాలకు తీర్చే క్రమంలో, టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకేఎం) ఈరోజు ఇన్నోవా హైక్రాస్ ఎక్స్ (ఓ) పెట్రోల్ వేరియంట్‌లో కొత్త గ్రేడ్‌ను పరిచయం చేస్తున్నట్లు ప్రకటించింది. ఇన్నోవా హైక్రాస్ లైనప్‌కి సరికొత్త జోడింపు ఇది, 10కి పైగా అధునాతన సౌకర్యాలు, సాంకేతికత ఫీచర్‌లను ఇది కలిగి ఉంది. ఇన్నోవా హైక్రాస్ జీ (ఓ) గ్రేడ్ బుకింగ్‌లు ఇప్పటికే తెరిచి ఉన్నాయి, డెలివరీలు ఏప్రిల్ 15, 2024 నుండి ప్రారంభమవుతాయి.

7, 8-సీటర్ ఆప్షన్‌లలో అందించబడుతున్న, ఎక్స్ (ఓ) గ్రేడ్ బ్లాకిష్ అగేహా గ్లాస్ ఫ్లేక్, ప్లాటినం వైట్ పెర్ల్, ఆటిట్యూడ్ బ్లాక్ మైకా, స్పార్క్లింగ్ బ్లాక్ పెర్ల్ క్రిస్టల్ షైన్, సిల్వర్ మెటాలిక్, సూపర్ వైట్ అవాంట్ గార్డ్ కాంస్య మెటాలిక్ అనే ఏడు రంగులు లభిస్తుందనీ టొయోటా కిర్లోస్కర్ మోటర్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ చెప్పారు.

రాములోరి పెళ్లి రాట మహోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని బంటుపల్లి కల్లాలు పంచాయతీ పరిధిలో శ్రీ సీతారాములు శ్రీరామనవమి వేడుకలకు రామాలయం వద్ద సోమవారం పెళ్లి రాటా మహొత్సవాన్ని వైభవంగా పండితులు నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 17న సీతారాములు కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించ డానికి నిశ్చయించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీతారాముల ఆలయం వద్ద ఆలయ పురోహితులు సామవేదం సీతారామయ్య ఆధ్వర్యంలో మహిళలు ముందుగా పెళ్లి రాటకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి పూలతో అలంకరించి పూజలు చేశారు. రాములోరి కళ్యాణానికి పెళ్లిరాట వేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు గ్రామ పెద్దలు పెళ్లిరాట వద్ద నవధాన్యాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సాయి పద్మకు సంతాపం తెలిపిన తాడి

విశాలాంధ్ర - ఆనందపురం: పేదల పెన్నిధి, బడుగుల ఆశాజ్యోతి 'సాయి పద్మ' (52) సోమవారం మృతి చెందారు. ఆమెకు ఆరోగ్యం బాలేకపోవడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె ఆకస్మాత్తుగా ఆస్పత్రిలో మృతి చెందారు. సాయి పద్మ తండ్రి డాక్టర్ బీఎస్సార్ మూర్తి గజపతినగరంలో పేరొందిన వైద్యులు. ప్రొఫెసర్ బాలమోహన్ దాస్ ఈమెకు స్వయానా చిన్నాన్న. పద్మ చిన్నతనం నుంచీ చదువులో ముందుండేవారు. అప్పట్లో జరిగిన ఓ ప్రమాదం కారణంగా జీవితకాలం పద్మ వీల్చైర్కే పరిమితమైపోయారు. సాయి పద్మ అంటే సాయంలో ముందుంటారని తాడి మనోహర్ సంతాపం తెలియజేశారు.

మోతీలాల్ ఓస్వాల్ ఎన్సీడిలు ప్రకటన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్ ఫేస్ వాల్యూ కలిగిన సెక్యూర్డ్ రీడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్స్ (ఎన్సీడిలు) పబ్లిక్ ఇష్యూను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. రూ. 1,000 చొప్పున రూ. 500 కోట్ల వరకు (" బేస్ ఇష్యూ సైజు "), గ్రీన్ షూ ఆప్షన్‌తో రూ. 500 కోట్ల వరకు, సంచితంగా రూ. 1,000 కోట్ల వరకు (" ఇష్యూ ") ఉంటుంది. ఎనిమిది సిరీస్ ఎన్సీడిలు స్థిర కూపన్‌లను కలిగి ఉంటాయి మరియు వార్షిక, నెలవారీ మరియు మెచ్యూరిటీ వడ్డీ ఎంపికలతో 24 నెలలు, 36 నెలలు, 60 నెలలు మరియు 120 నెలల కాలవ్యవధిని కలిగి ఉంటాయి. ఎన్సీడిలకు ప్రభావవంతమైన వార్షిక దిగుబడి 8.85 శాతం సంవత్సరానికి నుండి 9.70శాతం సంవత్సరానికి ఉంటుంది. ఇష్యూ ఏప్రిల్ 23, 2024న తెరవబడుతుంది మరియు మే 7, 2024న ముగుస్తుంది.

2వ వార్డులో ముత్తంశెట్టి ప్రచారం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం వైసిపి పార్టీ అభ్యర్థి అయిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం 2వ వార్డులో నిర్వహించారు. ప్రచారంలో భాగంగా 27వ రోజు 2వ వార్డు గడప గడపకు వెళ్లి 5ఏళ్ళలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు అమలు పాలన కోసం ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటేసి భీమిలిలో ముచ్చటగా మూడోసారి తనను ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థి బొత్సా ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలుపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 1,2 వార్డు వైసిపి శ్రేణులు, సచివాలయం కన్వినర్‌లు, గృహ సారథులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎన్నికల ప్రచారంలో భాగంగా జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కర రావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు 92 వ వార్డు రజక కాలనీ, శ్రీరామ్ నగర్ లలో బెహరా భాస్కర రావు , 89 వార్డ్ లో అయితం శెట్టి గోపి బృందం ఆయా వార్డుల్లో గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం సాగిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు 100 శాతం అమలు చేసిన నాయకుడు ఉన్నాడంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని తెలియపరుస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92 వ వార్డు అధ్యక్షులు గొర్లే అప్పలస్వామి నాయుడు, బురెడ్డి గోపి, 92, 89 వార్డుల కన్వీనర్లు, గృహ సారధులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.